


19 వ వసంతంలోకి ...

# సూర్య

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం,5 జనవరి 2026

8 పేజీలు




## అన్నవరం వ్రత విభాగంలో 'అంతర్గత' దోపిడీ

**తోటి పురోహితుల సొమ్ముకే కన్నం! - రూ.29 లక్షలు రికవరీ చేసే ఖాతాలో జమ**

**విచారణ మరింత లోతుగా జరుగుతుంది బాధ్యులను వదిలిపెట్టేది లేదు : ఈవో వేంద్ర**

**అన్నవరం/కాకినాడ,మేజర్‌న్యూస్:**అధ్యాత్మిక క్షేత్రమైన అన్నవరం వ్రత విభాగంలో ఒక భారీ ఆర్థిక కుంభకోణం వెలుగులోకి జాతీయ దినపత్రిక సూర్య తీసుకువచ్చింది. దేవుని సన్నిధిలో పవిత్రంగా విధులు నిర్వహించాల్సినఒకవ్రత పురోహితుడు, తోటి పురోహితుల శ్రమను దోచుకున్న వైనం విచారణలో బట్టబయలైంది. ఈఓవేంద్ర త్రినాథరావు చేపట్టిన మెరుపు విచారణతో ఈ 'రెమ్యూనరేషన్ స్కామ్' మూలాలు కదిలాయి.

**కుంభకోణం సాగిందిలా..**దేవస్థాన నిబంధనల ప్రకారం,సత్యనారాయణ స్వామివ్రతాలు చేయించే పురోహితులకు భక్తులు చెల్లించే రుసుములో 40 శాతం రెమ్యూనరేషన్‌గా లభిస్తుంది. ఈ ప్రక్రియలో జరిగిన లోపాలను సదరు వ్రత పురోహితుడు ఆసరాగా చేసుకున్నాడు.

**నమ్మకమే పెట్టుబడిగా**

- తరువాయి 2లో..

### మళ్ళీ పెచ్చుమీరుతున్న

## ఆక్రమణలు

**- రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు - పట్టించుకోని అధికారులు**





**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** పోలవరం నూతన జిల్లా ప్రధాన కేంద్రమైన రంపచోడవరంలో ప్రధాన రహదారితో పాటు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్‌లో మరలా ఆక్రమణలు పెచ్చుమీరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆరుమాసాలక్రితం రంపచోడ వరం ప్రధాన రహదారి, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగింపు అధికారులు నిర్వహించారు. దీంతో ప్రభుత్వ భవనాలు మినహాప్రైవేట్‌వ్యాపారులకు సంబంధించిన భవనాలు, దుకాణాలు కొంతవరకు తొలగించారు. అయితే అన్ని ప్రాంతాలలోనూ రెవెన్యూ, ఆర్ అండ్ బి అధికారులు మార్కింగ్ ఇచ్చిన ఆక్రమ నిర్మాణాలు పూర్తిగాతొలగించకపోవడంతో కొన్నిచోట్ల ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ఇదిలావుండగా రంపచోడవరంలో గతంలో ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో మళ్ళీ ఆక్రమణలు పెరుగుతున్నాయి. రాత్రికి రాత్రే పాకలు,పందిర్లు,రేకులతో షెడ్లు వేయడంతో పాటు ప్రభుత్వ

- తరువాయి 2లో..

### ప్రభుత్వ భూమిపై

## 'వెంకటరామ' కన్ను..!







- రాజకీయ చీకటి ఒప్పందాల నీడలో హుస్సేన్‌పురం
- మెగా కబ్జా ఆయిల్ స్కాం
- ప్రభుత్వ భూమిగా పంచాయతీ బోర్డు పెట్టి తొలగించిన సెక్రటరీ
- పార్కింగ్ పేరుతో పక్కాగా స్కెచ్ ..
- నాయకులు భుజించడంతో ఊపందుకున్న వైనం

**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** అధికార గణంఅండ ఉంటే.. అక్రమార్కులకు అడ్డూఅదుపు ఉండదా? ప్రభుత్వభూమి కనిపిస్తేచాలు ప్రైవేటు సామ్రాజ్యాలు విస్తరించాల్సిందేనా..? కాకినాడ జిల్లా సామర్లకోట మండలంలోని హుస్సేన్ పురం సాక్షిగా ఇప్పుడు ఇదే చర్చ నడుస్తోంది. వెంకటరామ ఆయిల్‌ఫ్యాక్టరీ యాజమాన్యం నిబంధనలను తుంగలో తొక్కి,ఏకంగా అరఎకరం ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి వేసిన స్కెచ్ ఇప్పుడు సంచలనంగా మారింది.

**-పార్కింగ్ పేరుతో 'పక్కా' ప్లాన్!**

హుస్సేన్ పురం గ్రామంలోని భీమవరం సర్వే నంబర్ 270 పరిధిలో గత కొంతకాలంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ ఫ్యాక్టరీ, ఇప్పుడు రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంపై కన్నేసింది.

**-అక్రమ నిర్మాణం :** ఫ్యాక్టరీకి తూర్పు వైపున ఉన్న ఖాళీ స్థలాన్ని గ్రావెల్‌తో చదును చేసి, సిమెంట్ స్తంభాలు పాతి, శాశ్వత కట్టడానికి పునాదులు వేస్తోంది.

**-ప్రజా ఇబ్బందులు :** ఫ్యాక్టరీకి వచ్చే వందలాది వాహనాలను రోడ్డుపైనే నిలుపుతుండటంతో బాటసారులు, ప్రయాణికులు నరకం చూస్తున్నారు. సొంత ఆవరణలో పార్కింగ్ సౌకర్యం

- తరువాయి 2లో..





## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం

- రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది
- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- రాజవరం-పొదాలాడ రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలక్ష్యంగా పనిచేస్తుందని, ప్రధానిమోడీ, ముఖ్యమంత్రి చంద్ర బాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్రంలోపనిచేస్తుందని కొత్తపేటఎమ్మెల్యేబండారు సత్యానంద రావు అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రహదారులను అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ఆదివారం రూ.3.90 కోట్ల రాష్ట్ర హైవే ప్లాన్ నిధులతో నిర్మించనున్న రాజవరం - పొదాలాడ రహదారి అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బొబ్బర్లంక, వద్దిపర్రు రహదారి గుంతలతో అధ్వాన్నంగా ఉందని మరమ్మతుల నిమిత్తం రూ.70లక్షలు మంజూరు అయ్యాయని, జీవో రావాల్సి ఉందన్నారు. అయినా కాంట్రాక్టరును తాను స్వయంగా సంక్రాంతి పండుగ లోపు మరమ్మతులు చేయమని కోరానని, వారు పనులు మొదలుపెట్టారని అన్నారు. ఈరహదారినివెడల్పు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రహదారి వెడల్పు

- తరువాయి 2లో..

# కోకో గింజలకు ధర పాలసీ ప్రకటించాలి

**- గిట్టుబాటు ధర కోసం మరో ఉద్యమం**
**- ఏపి కోకో రైతుల సంఘం సమావేశం హెచ్చరిక**



**పెదవేగి,మేజర్ న్యూస్ :** కోకో గింజలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ధర పాలసీ ప్రకటించాలని, అంతర్జాతీయ ధరకు అనుగుణంగా ఫార్ములా ప్రకటించి కోకో గింజలకు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని లేకుంటే కోకో గింజలకు గిట్టుబాటు ధర కోసం మరో ఉద్యమం తప్పదని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రిటైర్డ్ డిజిపి ఏబీ వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం పెదవేగి మండలం విజయరాయి గాంధీ నగర్ లోని సీతారామ కళ్యాణ మండపంలో కోకో రైతుల రాష్ట్ర సమావేశాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కోకో రైతుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈనెల 8,9 తేదీల్లో ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ కు, వ్యవసాయ శాఖ మంత్రికి వినతి పత్రాలు అందజేసి ఈనెల 12వ తేదీన జిల్లాల్లో కలెక్టర్ కార్యాలయాలకు కోకో రైతుల రాయబార కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యాన శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ ప్రకారం కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా ధర ఫార్ములా ప్రకటించి ధర నిర్ణయించి కంపెనీలు కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కోకో గింజలు సీజన్ ప్రారంభమైందని మరలా కంపెనీలు సిండికేట్‌గా మారి తక్కువ ధర కొనుగోలు చేసి రైతులను నష్టపరిచే ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్ కు సంబంధించిన కోకో గింజలు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ధర పాలసీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోళ్ల వెంకట సుబ్బారావు,పానుగంటి అచ్యుతరామయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కోనేరు సతీష్ బాబు, పాలడుగు నరసింహారావు,నాయకులు మోరంపూడి సుబ్రహ్మణ్యం, ఎన్.దశరథ రామయ్య వివిధ జిల్లాల నుండి వచ్చిన కోకో రైతులు పాల్గొన్నారు.

# మేడిశెట్టివారి పాలెంలో పేకాట శిబిరంపై పోలీసుల దాడి



**చింతలపూడి,మేజర్ న్యూస్ :** జంగారెడ్డిగూడెం ఎఎస్‌పి సుస్మిత ఆదేశాలపై చింతలపూడి మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతూ పోలీసులు దాడులు నిర్వహించారు.
సర్కిల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ సతీష్ కుమార్ వారి సిబ్బందితో కలిసి మేడిశెట్టివారి పాలెం గ్రామంలో పేకాట శిబిరం పై దాడులు నిర్వహించారు. 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.6,200 రూపాయల లు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు ఎస్ఐ చేశారు. ఎస్ఐ సతీష్ కుమార్ మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా పేకాట, కోడి పందాలు లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తే, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే, ఆ సమాచారాన్ని వెంటనే డయల్ 112కు గానీ,నేరుగా చింతలపూడి ఎస్ఐ ఫోన్ 9440796675 గానీ అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం

**మొదటిపేజి తరువాయి**

చేయడానికి రూ.35 కోట్ల సెంట్రల్ రోడ్ ఫండ్ నిధుల కోసం కూడా ప్రయత్నిస్తున్నట్లు, త్వరలో మంజూరు అయ్యే అవకాశం ఉందన్నారు.

ఆత్రేయపురం ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ఈ నెల 11,12,13 తేదీల్లో నిర్వహించనున్న ఆత్రేయపురం ఉత్సవాలు, డ్రాగన్ పడవ పోటీలు, ఈత పోటీలు, ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, ఆర్ అండ్ బి డిఈ రాజేంద్రప్రసాద్, సర్పంచ్ వేముల శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు నాగిరెడ్డి సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షులు జోజ్జవరపు హరిబాబు, తెలుగు యువత అధ్యక్షులు వెచ్చ అనిల్, కూటమి నాయకులు నరాలశెట్టి వెంకన్న, జానా వీరాంజనేయులు, మిద్దె శ్రీరామచంద్రమూర్తి, దొడ్డపనేని త్రినాధ రావు తదితరులు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిపై 'వెంకటరామ' కన్ను..!

**మొదటిపేజి తరువాయి**

కల్పించాల్సిన యాజమాన్యం, ప్రభుత్వ రోడ్డునే తన సొత్తుగా భావిస్తుండటంపై గ్రామ ప్రజలు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు.

**- రాజకీయ 'చీకటి' ఒప్పందాలు.. బోర్డులు మాయం..!**

ఈ భూ ఆక్రమణ వెనుక బలమైన రాజకీయ శక్తుల హస్తం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక పంచాయతీ పాలకవర్గం మరియు కొంతమంది టిడిపి నాయకులు ఫ్యాక్టరీ యాజమాన్యంతో "చీకటి ఒప్పందాలు" చేసుకున్నారని గ్రామస్థులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

ట్విస్ట్ ఏంటంటే : మొదట్లో అతి ఉత్సాహం ప్రదర్శించిన గ్రామ కార్యదర్శి పి. నరేంద్ర, ఆక్రమణ స్థలంలో 'హెచ్చరిక బోర్డులు' ఏర్పాటు చేశారు. కానీ, రాజకీయ ఒత్తిళ్ల పుణ్యమా అని కేవలం రెండు రోజుల్లోనే ఆ బోర్డులు మాయమయ్యాయి. ఇది పంచాయతీ వైఖరిని ఎండగడుతోంది.

**-అధికారుల 'సర్వే' నాన్చుడు ధోరణి**

ఈ స్థలం భీమవరం సర్వే నంబర్ 270 కిందకు వస్తుందా? లేక జగ్గమ్మ గారి పేట సర్వే నంబర్ 133 కిందకు వస్తుందా? అన్న దానిపై రెవెన్యూ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఈ అయోమయాన్ని అదునుగా చేసుకుని ఫ్యాక్టరీ యాజమాన్యం తన ప్రహరీ గోడను మరింత ముందుకు జరిపేందుకు పావులు కదుపుతోంది. అటు మున్సిపాలిటీ, ఇటు పంచాయతీ ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ నోటీసులు ఇవ్వకుండా కాలయాపన చేయడం గమనార్హం.

**-తహసీల్దార్ వివరణ : చర్యలు తప్పవు!**

ఈ వివాదంపై తహసీల్దార్ కే. చంద్రశేఖర్ రెడ్డి స్పందిస్తూ.. "ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత మాపై ఉంది. అది మున్సిపాలిటీదా లేక పంచాయతీదా అన్నది పక్కన పెడితే, త్వరలోనే మండల సర్వేయర్‌తో క్షేత్రస్థాయిలో సర్వే చేయించి, ఆక్రమణలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం," అని వెల్లడించారు. ప్రజా డిమాండ్ లక్షలాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాలను అడ్డుకోవాలని, పెద్దాపురం నియోజకవర్గ స్థాయి నేతలు ఈ విషయంలో మౌనం వీడాలని స్థానికులు కోరుతున్నారు. మరి అధికారులు ఆక్రమణలను తొలగిస్తారా? లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతారా? అన్నది వేచి చూడాలి.

# అన్నవరం వ్రత విభాగంలో 'అంతర్గత' దోపిడీ

**మొదటిపేజి తరువాయి**

: వందలాది మంది పురోహితుల బిల్లులను క్రమబద్ధీకరించడం అధికారులకు కష్టతరం కావడంతో, పురోహితులలో ఒకరిని ఈ బిల్లుల సమన్వయకర్తగా నియమించారు.

**డిజిటల్ మాయాజాలం :** సెక్షన్ అధికారులకు బిల్లులు సమర్పించే సమయంలో, ఇతర పురోహితుల పేర్ల ఎదురుగా ఉండాల్సిన వారి సొంత ఖాతా నంబర్లకు బదులుగా, తన వ్యక్తిగత బ్యాంక్ ఖాతా నంబర్లను లేదా తనకు అనుకూలమైన వారి ఖాతాలను చేర్చి తప్పుదోవ పట్టించాడని ప్రాథమిక నిర్ధారణ.

**లక్షల్లో గోల్‌మాల్ :** ఇలా ఒక్కొక్కరి నుంచి కొంత మొత్తాన్ని మళ్లిస్తూ, లక్షల రూపాయల మేర తోటి వారి కష్టార్జితాన్ని తన జేబులో వేసుకున్నాడని విచారణలో వెలుగు చూసిన నిజాలు..పత్రికా కథనాల ఆధారంగా ఈఓ వేంద్ర త్రినాధరావు ప్రాథమిక విచారణ ప్రారంభించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి:

- రికవరీ: వ్రత పురోహితుడి అక్రమం బయటపడడంతో ప్రాథమికంగా గుర్తించిన 29 లక్షల రూపాయలను సదరు పురోహితుడి నుంచి అధికారులు ఇప్పటికే రికవరీ చేశారు.

**-వ్యవస్థ ప్రక్షాళన:** భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఉండేందుకు పురోహితులందరి బయోమెట్రిక్ వివరాలు మరియు వారి ఆధార్ లింక్డ్ బ్యాంక్ ఖాతాలకు నేరుగా సొమ్ము వెళ్లేలా చర్యలు తీసుకోనున్నారు ఈవో వేంద్ర త్రినాధరావు.

**నిందితులపై వేటు తప్పదు :** ఈఓ త్రినాధరావు ఈ విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారు. "డబ్బు రికవరీ చేయడమే కాకుండా, విచారణ పూర్తయ్యాక బాధ్యులపై శాఖాపరమైన తీసుకుంటామని ఆధ్యాత్మిక సంస్థలో అవినీతికి తావులేదు" అని ఆయన స్పష్టం చేశారు.

# మళ్ళీ పెచ్చుమీరుతున్న ఆక్రమణలు

**మొదటిపేజి తరువాయి**

స్థలాలను యదేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. మరికొంతమంది గ్రీన్ క్లాత్‌తో రోడ్డుప్రక్క స్థలాల్లో అక్రమంగా వ్యాపారాలకు అద్దెకు ఇచ్చేందుకు పాగావేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాల్లో రోడ్డు ప్రక్క స్థలాలు ఆక్రమిస్తేచర్యలు తీసుకుంటామని గ్రామపంచాయతీహెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని ఖాతరుచేయకుండా కొంతమంది వ్యాపారులు స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో ఆక్రమణలు కొనసాగిస్తు న్నారు. కాగా రాజకీయ నాయకుల సిఫార్సులతో ఆక్రమణ ప్రదేశాల్లో నిబంధనలు పాటించకుండా విద్యుత్ అధికారులు విద్యుత్ మీటర్లు ఇవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రంపచోడవరంలో ప్రధాన రహదారి, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్‌లో డ్రైనేజీ నిర్మాణానికి మూడున్నర కోట్లు రూపాయలు నిధులు మంజూరు అయ్యాయి. డ్రైనేజీ నిర్మాణం జరిగే ప్రాంతాల్లోనూ ఆక్రమణలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

రంపచోడవరంలో ఆక్రమణలు తొలగించే విషయంలో రహదారులు భవనాల శాఖ, రెవిన్యూ శాఖ, గ్రామపంచాయతీ మధ్య సరైన సమన్వయం లేకపోవడంతో ప్రభుత్వ స్థలాలు యదేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయి. ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాలని గతంలో రహదారులు భవనాల శాఖ, పంచాయతీ అధికారులకు ఉత్తర్వులు పంపడం జరిగిందని స్థానిక రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. రెవిన్యూ శాఖ ఆదేశాలు ఇస్తే ఆక్రమణలు తొలగించేందుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని రహదారులు భవనాల శాఖ, గ్రామపంచాయతీ అధికారులు అంటున్నారు. ప్రస్తుతం పోలవరం జిల్లా కేంద్రంగా రంపచోడవరం మారడం వల్ల భవిష్యత్ అవసరాలకు ఆక్రమణ స్థలాలు విషయంలో అధికారులు వెంటనే స్పందించకపోతే మరిన్ని ఇబ్బందులు తప్పవు. గిరిజన మహిళల పేరుతో కొంతమంది గిరిజనేతర వ్యాపారులు రోడ్డు పక్క స్థలాలు ఆక్రమించి అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తూ లబ్ధి పొందాలని ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆక్రమణలు తొలగింపుతో ఉపాధి కోల్పోయిన కొంతమంది గిరిజన వ్యాపారులకు స్థలం కేటాయించి దుకాణాలు ఏర్పాటుకు సహకరిస్తామని గతంలో అధికారులు చెప్పినప్పటికీ నేటి వరకు కార్య రూపం దాల్చలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రంపచోడవరంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగింపుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా "అవాంటెల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్" ప్రారంభం





**కాకినాడ, మేజర్ న్యూస్ :** జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాకినాడలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో సిగ్నల్ ప్రాసెసింగ్ & కమ్యూనికేషన్స్ రంగంలో "అవాంటెల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్"ను 04 జనవరి 2026, ఆదివారం ఉదయం 11.00 గంటలకు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం జేఎన్టీయూకే కాకినాడ క్యాంపస్‌లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో నిర్వహించబడింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జేఎన్టీయూకే వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కే.ప్రసాద్ మరియు అవాంటెల్ లిమిటెడ్ సంస్థ స్థాపకుడు మరియు సీఎండీ డా. ఏ.విద్యాసాగర్ ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జేఎన్టీయూకే వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కే.ప్రసాద్ మాట్లాడుతూ, పరిశ్రమ–విశ్వవిద్యాలయాల మధ్య ఇలాంటి భాగస్వామ్యాలు విద్యార్థుల్లో పరిశోధన దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రాక్టికల్ అనుభవాన్ని కూడా సంపాదించగలుగుతారని పేర్కొన్నారు. డా.ఏ.విద్యాసాగర్ మాట్లా డుతూ, అవాంటెల్ లిమిటెడ్ సంస్థ దేశంలోనే ప్రముఖంగా డిఫెన్స్, ఏరోస్పేస్ మరియు కమ్యూనికేషన్ టెక్నాలజీల రంగాలలో పరిశోధన, డిజైన్ మరియు తయారీ సేవలు అందిస్తున్న సంస్థగా గుర్తింపు పొందిందని తెలిపారు. జేఎన్టీయూకేతో కలిసి ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలె న్స్‌ను ఏర్పాటు చేయడం ద్వారా యువతకు పరిశ్రమకు అనుగుణమైన శిక్షణ, పరిశోధన అవకాశాలు మరియు ఇన్నోవేషన్ దిశగా ప్రోత్సాహం లభిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసిన జేఎన్టీయూకే యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కాకినాడలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా.బి.లీల కుమారి మాట్లాడుతూ, ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా సిగ్నల్ ప్రాసెసింగ్ మరియు కమ్యూనికేషన్స్ రంగాలలో విద్యార్థులు, పరిశోధకులు అధునాతన ప్రయోగాలు, ప్రాజెక్టులు, పరిశోధన కార్యక్రమాలు చేపట్టేందుకు విశేష అవకాశాలు కలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు, డైరెక్టర్‌లు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య విద్యార్థినుల స్వచ్ఛభారత్




**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ & పి.జి కళాశాల ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు కళాశాలలో స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి భద్రత అని అన్నారు. ప్రతీ ఆదివారం మహిళా కళాశాల విద్యార్థినులు సమాజం కోసం సమయాన్ని కేటాయించి సేవలు చేయడం అభినందనీయం అని అన్నారు. ఆదిత్య మహిళ డిగ్రీ & పి.జి కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ మన కళాశాలకు చెందిన ఎన్.ఎస్.ఎస్. బృందం చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు చురుగ్గా పాల్గొన్నారని, రానున్న సంక్రాంతిని పురస్కరిచుకుని కళాశాల ప్రాంగణంలో పరిశుభ్రం చేసినట్లు తెలిపారు. జరగనున్న సంక్రాంతి సంబరాలకి అవసరమగు ఏర్పాట్లును చేసినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య మహిళా డిగ్రీ & పి.జి కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్స్ పి.బి.టి.సురేఖ దేవి, ఫిజికల్ డైరెక్టర్ ఎన్.సత్యవతి మరియు ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

# లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కేలండర్ ఆవిష్కరణ



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ పాతపాటి వేంకటసత్యనారాయణ రాజు పర్యవేక్షణలో వేద ఆశీర్వచనతో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి 2026 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఇందులో పంచాంగము శ్రీవారి వారోత్సవములు పక్షోత్సవములు మాసోత్సవములు, ఆయనోత్సవములు, సంవత్సరోత్సవములు తెలిపే వివరాలు, శ్రీవారి చిత్రమాలికలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో గోరింట వినయ్ కుమార్ రాజు, ముదునూరి సోమరాజు, ముదునూరి సురేష్ రాజు, మంతెన ఆనంద రాజు, మురళికృష్ణం రాజు, గాదిరాజు ప్రసాద్ రాజు, వేగేశ్న కాశీ విశ్వనాథరాజు, వెంకట రామరాజు, రవిరాజు, ముదునూరి వెంకట రాజు, పులవర్తి నాగేశ్వర రావు, ఆలయ ప్రధాన అర్చకులు వాడపల్లి పవన్ తేజ, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా శ్రీ సత్యదేవుని రథ సేవ





**అన్నవరం, మేజర్ న్యూస్ :** శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో శ్రీ సత్యదేవుని రథ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు శ్రీస్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకముల సుగంధభరితమైన పుష్పములతో అలంకరించి రథ వాహనంపై ఆశీనులు గావించి వేదపండితుల మంత్రోచ్చరణ, మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు.

రథసేవ కార్యక్రమంలో చిన్నారు లతో భరతనాట్యం చూడముచ్చటగా జరిగింది. ఈ రథ సేవ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు, అర్చకులు, దేవస్థానం సూపర్డెంట్, దేవస్థాన అధికారులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వ అవకతవకలకు బ్రేక్

**– విద్యుత్ చార్జీల తగ్గింపుతో ప్రజలకు ఊరట**




**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గించాలనే దృఢ సంకల్పంతో నూతన సంవత్సర కానుకగా విద్యుత్ చార్జీలను తగ్గించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కాకినాడ రూరల్ నియోజకవర్గం ప్రజల తరఫున రూరల్ టీడీపీ కోఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ కొనుగోలులో అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయని, విధ్వంసకర విధానాలతో విద్యుత్ చార్జీలు పెంచుతూ ప్రజలపై అన్ని విధాల భారాలు మోపారని విమర్శించారు.

ప్రతి యూనిట్‌పై 13 పైసలు చార్జీలు తగ్గించడం ద్వారా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన ఊరట కల్పించిందని, 2019 నుంచి 2024 వరకు విద్యుత్ వినియోగానికి సంబంధించిన ట్రూ అప్ చార్జీలుగా ఉన్న రూ.4,498 కోట్ల భారాన్ని ప్రభుత్వమే భరిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం ప్రజల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న బాధ్యతాయుత దృక్పథానికి నిదర్శనమని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల కోసమే ప్రభుత్వం పనిచేస్తోందన్న విషయం ప్రజలు గమనించాలన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు అవసరమైన అన్ని వసతులు, సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని పేర్కొంటూ, ఉచిత బస్సు ప్రయాణం, దీపం పథకం, అన్నదాత సుఖీభవ వంటి కార్యక్రమాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతోందని తెలిపారు.

ఈ నిర్ణయాలు రాష్ట్ర ప్రజలకు నిజమైన ఉపశమనం కలిగించాయని పేర్కొంటూ, మరోసారి కాకినాడ రూరల్ నియోజకవర్గ ప్రజల తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట ప్రకాష్ గౌడ్, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి కౌజు నెహ్రూ, మందరపు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# సనాతన ధర్మంతో... ధర్మ పరిరక్షణ





**– ఆత్రేయపురంలో హిందూ సమ్మేళనం**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** యుగ యుగాలుగా సనాతన ధర్మంతోనే ధర్మ పరిరక్షణ కొనసాగుతుందని తద్వారా శాంతి వెల్లివిరుస్తుందని కాకినాడ శ్రీపీఠం పరిపూర్ణానంద సరస్వతి అన్నారు. ఆదివారం మండల కేంద్రం ఆత్రేయపురంలోని టిటిడి కళ్యాణ మండపంలో జరిగిన హిందూ సమ్మేళనం ఆర్ఎస్ఎస్ నూరు వసంతాల వేడుక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వ్యవసాపకుడు పాతపాటి వెంకట సత్యనారాయణ రాజు అధ్యక్షత వహించగా ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ముదునూరి సీతారామరాజు సందీప్, మహిళా వక్తగా పులవర్తి శ్యామలా చెల్లాయమ్మ వ్యవహరించారు. ప్రధాన వక్తగా కన్యాకుమారి వివేకానంద కేంద్రం సంపర్క ప్రముఖ ఆదర్శనీయ సదాశివ తన ప్రధానోపాన్యాసంలో హిందూ హిందువుగా జీవిస్తే మత మార్పిడి అనేది ఉండదని అన్నారు. పరిపూర్ణానంద సరస్వతి స్వామీజీ మాట్లాడుతూ త్రాతయుగం, ద్వాపరయుగం, కలియుగం యుగం ఏదైనా హైందవ ధర్మం శాంతి ప్రేమ దయా గుణాలను ఆభరణాలుగా ధరించి ప్రపంచ శాంతిని కోరుకుంటుందని అన్నారు. విశిష్ట అతిథిగా పూజ్యశ్రీ రామచంద్రశేఖర్ స్వామీజీ కాకినాడ శ్రీపీఠం పరిపూర్ణానంద సరస్వతి స్వామీజీ వారి శిష్యులు శ్రీ రామాయణ రత్న సుధాకర బిరుదాంకితులు అమ్మ, ఆవు హిందూ సమాజంలో ఏ విధంగా విశిష్టమైనవో విపులంగా చెప్పారు ఈ కార్యక్రమనిర్వాహకులు మహర్షి రామరాజు, గాదిరాజు ప్రసాదరాజు, ఆటపాకల శ్రీనివాస్, పేరూరి నాగేశ్వరరావు, చంపాటి అనిల్ కృష్ణ, ముదునూరు సురేష్ రాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఈ కార్యక్రమంలో వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, మాజీ ఎంపీపీ పి.ఎస్.రాజు, తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్, దేవస్థానం పాలకమండలి సభ్యులు శిష్ట సూర్య కుటుంబరావు, ఏపుగంటి సుబ్బారావు, చిటికెన సత్యనారాయణ, గొట్టుముక్కల గోపిరాజు, చేకూరి కృష్ణంరాజు తదితరులు ఉన్నారు.

## ప్రజా సేవకు మరింత అందుబాటులో ఉండేందుకే వట్టిగడ్డలో పార్టీ కార్యాలయం

**– ఎమ్మెల్యే శిరీషా దేవి**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** ప్రజా సేవకు మరింత అందుబాటులో ఉండేందుకే మండలంలోని వట్టిగడ్డ గ్రామంలో పార్టీ కార్యాలయం ప్రారంభించి గృహప్రవేశం చేయడం జరిగిందని ఎమ్మెల్యే శిరీష దేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి పార్టీ కార్యాలయం రంపచోడవరంలోని ఉందని మరో పార్టీ కార్యాలయం వట్టిగడ్డలో ప్రారంభించామన్నారు. ఇక్కడ వరకు రావడానికి వీలుగాని నియోజకవర్గ ప్రజలు రంపచోడవరం పార్టీ కార్యాలయంలో ఫిర్యాదులు అందజేస్తే పీఏలు తమకు చేరుస్తారని నియోజకవర్గ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు. రాజవొమ్మంగి మండలంలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని ప్రతి పంచాయతీ తిరగాల్సిన అవసరం ఉంది కాబట్టి సంక్రాంతి తర్వాత ముందుగా రాజవొమ్మంగి మండలంలో పంచాయితీలు పర్యవేక్షణకు వెళ్లడం జరుగుతుందని ఎమ్మెల్యే శిరీష దేవి అన్నారు. ప్రజా సేవలో అందుబాటులో ఉండేందుకు సిద్ధంగా ఉన్నామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్, సీనియర్ నాయకులు గణజాల తాతారావ్, ఎంపీటీసీ నల్ల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# ఆరోపణలు నిరూపిస్తే ఎంతటి శిక్షకైనా సిద్ధం



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** శ్రీకృష్ణదేవరాయలు వారి చిత్రపటాన్ని అవమానించామని, మరియు కాళ్ళ కింద వేసి తొక్కామని చేస్తున్న ప్రచారంలో ఎటువంటి నిజం లేదని, మహనీయుడి చిత్రపటాన్ని అవమానించలేదని ఒకవేళ నిరూపిస్తే ఎంతటి శిక్షకైనా నేను సిద్ధమని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. అర్ధరాత్రి అంత మహనీయుని విగ్రహం ఎంకేఆర్ జంక్షన్ నందు ప్రతిష్టించాల్సిన అవసరం ఏముందని, అందరితో చర్చించి అనుకూలమైన స్థలంలో రోడ్డు ప్రమాదాలు జరగని స్థలంలో విగ్రహాన్ని ప్రతిష్టిస్తే దానికి మా తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఆయన అన్నారు. శ్రీ కృష్ణదేవరాయలవారి కాపు కళ్యాణమండపం వద్ద పెట్టాలి అనుకున్న విగ్రహం అక్కడినుండి ఆక్సిడెంట్స్ జరిగే స్థలానికి ఎందుకు మార్చారు అని ప్రశ్నించారు. తాను శాసన సభ్యులుగా ఉన్నప్పుడు వివిధ వర్గాల నుండి సర్ ఆర్థర్ కాటన్, అల్లూరి సీతారామరాజు, జ్యోతిరావు పూలే, అంబేద్కర్, హనుమాన్ విగ్రహాలు పెట్టమని తనకు అభ్యర్థన వచ్చినా అక్కడ తరచూ ఆక్సిడెంట్లు జరిగే ప్రాంతం కాబట్టి అప్పుడు తిరస్కరించామన్నారు. అదే రోడ్లో నాలుగు కళ్యాణ మండపాలు మరియు స్కూల్లు మరియు హాస్పిటల్‌లు ఉండడంవల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని ఆ ఉద్దేశ్య ప్రకారంగానే పంచాయతీ తీర్మానం ఉన్నప్పటికీ విగ్రహం పెట్టకూడదని సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఉన్నా సరే అక్రమంగా అర్ధరాత్రి పూట దిమ్మకట్టి శ్రీకృష్ణదేవరాయలు వారి చిత్రపటాన్ని అక్కడ ప్రతిష్టించడాన్ని ఆయన ఖండించారు. ఇది పూర్తిగా ప్రతిపక్షంలో ఉండి మేము చేస్తున్న ప్రతి కార్యక్రమానికి మరియు కూటమి ప్రభుత్వం యొక్క వైఫల్యాలను ప్రశ్నిస్తున్న తీరుకి మాపై బురద జల్లే కార్యక్రమాన్ని చేస్తున్నారని ఆరోపించారు. ఆ మహనీయుని విగ్రహంపై నాకు వ్యతిరేకత లేదు, అది ప్రజలకు ఇబ్బంది కలిగించని చోట ట్రాఫిక్ సమస్యలు తలెత్తని చోట ఏర్పాటు చేస్తే తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

## బాధితుడు రామకృష్ణను పరామర్శించిన అనూష యాదవ్



శంఖవరం, మేజర్ న్యూస్ : కత్తిపూడి గ్రామంలో డిసెంబర్ 31వ తేదీన రాత్రి దాడికి గురైన ముత్తిన రామకృష్ణను బీసీవై పార్టీ నాయకురాలు డాక్టర్ అనూష యాదవ్ ఆదివారం సాయంత్రం పరామర్శించారు. బాధిత కుటుంబానికి చట్టబద్ధంగా రక్షణ కల్పించాలని, అలాగే దోషులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఒక మనిషిపై విచక్షణారహితంగా దాడి చేసిన దోషులను రక్షించే ప్రయత్నాలు జిల్లాలో ఉన్న ప్రముఖ ప్రజా ప్రతినిధులు కేసు నీరుగారిచే పనిలో నిమగ్నం అవ్వడం వలన బాధిత కుటుంబం భయాందోళనకు గురవుతుందని న్యాయం దక్కదేమో అని ఆందోళనలో ఉన్నారని, వారందరికీ న్యాయం జరిగే వరకు తను అన్ని విధాల అండగా ఉంటానని అనూష యాదవ్ అన్నారు. ఈ విషయం మొత్తాన్ని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్‌కు బాధితుడే స్వయంగా వివరించగా, బాధిత కుటుంబానికి తోడుగా ఉంటానని, అవసరమైన సందర్భంలో కత్తిపూడి కొచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కత్తిపూడి, సీతంపేట గ్రామాలకు సంబంధించిన పలువురు పెద్దలు పాల్గొన్నారు.

## మెట్ల సత్యనారాయణరావుకు ఘన నివాళి



**అల్లవరం, మేజర్ న్యూస్ :** మండలంలోని కొమరగిరి పట్నం గ్రామంలో మాజీ మంత్రి, దివంగత నేత డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు 84వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మెట్ల రామ్మూర్తి పిఏసిఎస్ కొమరగిరి పట్టణం వద్ద ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు యాళ్ల దొర బాబు, జి.రోహిణి కుమార్, కుమ్మరి సత్యబాబు, గుర్రం దొర బాబు, మంతెన సురేష్ రాజు, బాసత్యనారాయణ, కడలి నాగేశ్వరి, పరశ, గుర్రం శ్రీను, ఆకుల పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

## హ్యుందాయ్ షోరూమ్‌ను సందర్శించిన డిప్యూటీ స్పీకర్



**అమలాపురం, మేజర్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో హ్యుందాయ్ షోరూమ్‌ను ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ఆదివారం సందర్శించారు. నూతనంగా అతిపెద్ద షోరూమ్‌ను ప్రారంభించడంతో లక్ష్మీ హ్యుందాయ్ ఆపరేషన్ హెడ్ సునీల్ కుమార్, షోరూమ్ మేనేజర్ సత్యమూర్తి ఆహ్వానం మేరకు షోరూమ్‌ను సందర్శించి జిల్లాలో అతిపెద్ద షోరూమ్‌గా ఉందని హ్యుందాయ్ కస్టమర్లకు మంచి సర్వీస్ ఇవ్వడానికి ఇతర జిల్లాలకు వెళ్ళవలసిన అవసరం లేకుండా ఏర్పాటు చేయడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. రఘురామ కృష్ణంరాజు లక్ష్మి హ్యుందాయ్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘురామకృష్టంరాజు వెంట ఎమ్మెల్సీ పేరబత్తుల రాజశేఖర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అమూడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు యాళ్ల దొరబాబు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు రంపచోడవరం ఐటిడిఏలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**– ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** అల్లూరి జిల్లా కలెక్టర్ నేడు జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం వరకు రంపచోడవరం ఐటీడీఏ సమావేశం మందిరంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పోలవరం ఇంచార్జి జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యల గురించి కచ్చితమైన, పూర్తి వివరాలతో దరఖాస్తు చేయాలని సూచించారు. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు. సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అర్జీని సమర్పించాలి. గతంలో ఫిర్యాదు చేసిన వారు తప్పనిసరిగా పాత అర్జీ రసీదు తీసుకురావాలని సూచించారు. అర్జీలో పేరు, చిరునామా, ఫోన్ నంబర్ స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కార్యాలయాల్లో కూడా పీజీఆర్ఎస్ జరుగుతుంది. ప్రజలు తమ సమీప కేంద్రాల్లో ఫిర్యాదు చేయవచ్చు.

మీ కోసం 1100 కాల్ సెంటర్ అర్జీదారులు కలెక్టరేట్‌కు రాకుండానే తమ సమస్యలను నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన 1100 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించ వచ్చునని కలెక్టర్ సూచించారు. గతంలో ఇచ్చిన అర్జీల స్టేటస్ తెలుసుకోవడానికి కూడా ఈ నంబర్‌కు కాల్ చేయవచ్చునని, అలాగే, మీకోసం.ఎపి.జివోవి.ఇన్. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా అర్జీలను సమర్పించవచ్చునని సూచించారు. జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు సత్వర పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ఉదయం 10.00 గంటలకు రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల తహసీల్దార్లు తప్పనిసరిగా ఉదయం 10.00 గంటలకు రంపచోడవరం ఐటీడీఏ సమావేశం మందిరంలో నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌కు హాజరై వినతులను స్వీకరిస్తారని తెలిపారు.

అలాగే ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించేందుకు సంబంధిత ఏఓ, డీటీలు అందుబాటులో ఉంటారని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌కు మండల సర్వేయర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు తమకు సంబంధించిన అన్ని రికార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. రైతులు, ప్రజలు తమ భూసంబంధిత సమస్యలు, రెవెన్యూ సమస్యలను ఈ రెవెన్యూ క్లినిక్ ద్వారా పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ఇల్లబోయిన ఉమ మృతికి సిఐటియు సంతాపం

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** సిఐటియు నాయకురాలు ఉమ మహేశ్వరి మృతి సిఐటియు, అంగన్‌వాడీ శ్రామిక మహిళా రంగాలకు తీరని లోటు అని సిఐటియు మండల కార్యదర్శి క్రాంతి, మండలాధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ మహేశ్వరి అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తూ అంగన్‌వాడీ సంఘాన్ని బలోపేతం చేసేందుకు తీవ్ర కృషి చేశారని, శ్రామిక మహిళా రంగంలో ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో పాటు ఇతర రంగాలలోని శ్రామిక మహిళలను సమీకరించి వారి హక్కుల కోసం ఆమె తీవ్రంగా కృషి చేసిందని, ఇటువంటి నిబద్ధత గల కార్యకర్తను కోల్పోవడం సిఐటియు, అంగన్‌వాడీ, ఇతర రంగాలకు తీరని లోటు అని సిఐటియు మండల కమిటి తీవ్ర విషాదం వ్యక్తం చేస్తూ సంతాపం తెలియజేశారు. అనంతరం ఉమ పార్థివ దేహం మీద సిఐటియు జెండా కప్పి నివాళులు అర్పించారు. సిపిఎం కాకినాడ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, పార్టీ జిల్లా కమిటి సభ్యులు నీలపాల సూరిబాబు, సిపిఎం మాజీ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ, అంగన్‌వాడీ ప్రాజెక్టు మహిళా నాయకులు దాడి బేబి, ఎస్తేర్ రాణి, టి.ఎల్.పద్మ,



స్నేహలత, సూర్యకుమారి, పద్మ, సావిత్రి, నూకరత్నం, సత్య, సిఐటియు నాయకులు చింతల సత్యనారాయణ, బి.సుధ, సిరపురపు శ్రీనివాస్, ఎస్.మరిడయ్య, కె.అప్పన్న, ఎన్.నరసింహమూర్తి, వై.రమేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మీ, తదితరులు సంతాపం తెలిపినవారిలో ఉన్నారు.

# కారణం లేకుండా ప్రభుత్వానికి నన్ను సరెండర్ చేశారు

**– డిఆర్డిఏ పిడి జయ చంద్ర గాంధీ**




**అమలాపురం, మేజర్ న్యూస్ :** తాను ఏ తప్పు చేయకపోయినా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ కారణం లేకుండా ప్రభుత్వానికి నన్ను సరెండర్ చేశారని డిఆర్డిఏ పిడి జయ చంద్ర గాంధీ తెలిపారు. ఆదివారం సాయంత్రం అమలాపురం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆరోపించారు. తాను ఎనిమిది నెలల క్రితం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డిఆర్‌డి ఏ పిడిగా బాధ్యతలు స్వీకరించానని అప్పటికి మూడు కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయి ఉంటే కేవలం తాను ఎనిమిది నెలల కాలంలో 90 లక్షల పైగా బకాయిలు వసూలు చేశానని జయ చంద్ర గాంధీ వెల్లడించారు. తాను దేశంలో ప్రముఖులైన ఎందరి వద్ద పనిచేసి వారి మెప్పులు పొందానన్నారు సుప్రీం కోర్ట్ రిటైర్డ్ రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి ఎన్వి రమణ వద్ద కూడా పనిచేసే మంచి పేరు పొందాననీ, తాను నిజాయితీగా పని చేసానని ఎక్కడ తప్పు చేసిన దాఖలా లేవన్నారు.

కొద్దిరోజుల క్రితం తన తల్లికి అనారోగ్యంగా ఉంటే సెలవుపై వెళ్లి వచ్చానని జనవరి ఒకటిన కలెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు చెప్పాననీ అప్పుడు తనను దగ్గరకు తీసుకుని భుజంపై చేయి వేసి నవ్వుతూ ఫోటో తీయించుకున్న ఆయన మర్నాడు పిలిచి ప్రభుత్వానికి సరెండర్ చేస్తున్నట్లు చెప్పి ఆదేశాలు ఉన్న లేఖ తన చేతిలో పెట్టారని డిఆర్‌డిఏ పిడి జయ చంద్ర గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. తాను గిరిజనుడిని కావడం తన వెనుక ఎవరూ అడగరని ధైర్యంతోనే కలెక్టర్ ఈ విధమైన చర్య తీసుకున్నారని డిఆర్‌డిఏ పిడి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ తనను సరెండర్ చేస్తూ తీసుకొని నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తాను చేసిన తప్పు ఏమిటో వెల్లడించాలన్నారు.

ఆయన చూపిన కారణాలు సమావేశాలకు వెళ్లలేదన్న ఆరోపణలు నిజం కాదన్నారు. ప్రతి సమావేశానికి తాను వెళ్లి రిజిస్టర్లో సంతకం చేశానని ఆయన స్పష్టం చేశారు. న్యాయపోరాటం చేస్తానని ఆయన హెచ్చరించారు. తన ఉద్యోగం పోయిన పర్వాలేదని తాను తప్పు చేశానన్న నింద నిరూపించాలని డిఆర్డిఏ పిడి జయచంద్ర కోరారు. ఈ విషయంపై కలెక్టరేట్ డిఆర్ఓ కే.మాధవిని వివరణ కోరగా దీనిపై ఆయనను సస్పెండ్ చేయలేదని సరెండర్ మాత్రమే చేసామని, సోమవారం మరోసారి కలెక్టర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం

**– పాల్గొన్న భక్తులు**



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు. వేదపండితులు ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పారిశుద్య పనుల పరిశీలన



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్:** పెద్దాపురం పురపాలక సంఘంలో శనివారం 8, 20వ వార్డులలో కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి సూచనల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్య పనులను మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వైస్‌ఛైర్మన్ మాట్లాడుతూ పురపాలక సంఘంలో పారిశుద్య పనుల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరిగిందని, దానిలో భాగంగానే ప్రతీ వారం శానిటేషన్ వర్కర్లతో పారిశుద్య పనులు వార్డుల వారీగా (గ్యాంగ్ వర్క్) నిర్వహించడం జరుగుతుందని, ఆయన తెలుపుతూ సిబ్బందికి పారిశుద్య పనులపై పలు సూచనలు చేశారు.

## మొక్కలు నాటిన ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆదివారం సేవా కార్యక్రమాలలో భాగంగా మొక్కలు నాటే నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పర్యావరణహిత కార్యక్రమాలలో భాగంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా విద్యార్థులు బృందాలుగా విడిపోయి బృందాలుగా విడిపోయి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ఆవరణ వ్యవస్థను రక్షించాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈ విషయమై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను అభినందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, డి.అశ్విని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి మాసోత్సవాలు 2026కు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ విడుదల

**- మోరంపూడి ఫ్లై ఓవర్ వద్ద హెల్మెట్,**
**సీటు బెల్ట్ ధారణపై అవగాహన కార్యక్రమం**
**- రోడ్డు ప్రమాదాలు దేశ జీడీపీపై 3 శాతం ప్రభావం**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జాతీయ రహదారి మాసోత్సవాలు 2026ను అనుసరించి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ సంపత్ కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక మోరంపూడి ఫ్లై ఓవర్ వద్ద జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో, పోలీసు శాఖ సిబ్బంది, ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులతో, స్వచ్ఛంద సంస్థలతో కలిసి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్, కారు నడిపే వారికి సీట్ బెల్ట్‌ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ సంపత్ కుమార్ మాట్లాడుతూ, జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్ ఆదేశాల మేరకు జిల్లాలో జాతీయ రహదారి మాసోత్సవాల సందర్భంగా ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రోగ్రామ్స్ రూపొందించినట్లు తెలిపారు. రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం, భద్రతా నియమాలు పాటించేలా చేయడం ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల దేశ జీడీపీపై సుమారు 3 శాతం వరకు ప్రభావం పడుతోందని తెలిపారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదని, అందుకే కేంద్ర ప్రభుత్వం ఇకపై ప్రతి ఏడాది నెల రోజుల పాటు జాతీయ రహదారి మాసోత్సవాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం దిశా నిర్దేశం చెయ్యడం జరిగిందనీ తెలిపారు. రవాణా శాఖ, పోలీసు శాఖ, ఆదిత్య కాలేజీ సంయుక్త ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌ధారణ, నాలుగు చక్రాలు వాహనాలు నడిపే వారికి సీట్ బెల్ట్ ధారణ అవసరాన్ని తెలియజేసే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మోటార్ సైకిల్ నడిపే వారు హెల్మెట్ ధరించకుంటే రూ.1000, కారు నడిపే వారు సీటు బెల్ట్ ధరించకుంటే రూ.1500 అపరాధ రుసుము విధించడం జరుగుతుందని వెల్లడించారు. ప్రమాదం జరిగే తీరును విద్యార్థులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐలు జి. ప్రణీత్ కుమార్, ఉమా మహేశ్వరరావు, కె. చైతన్య సుమ, ఆదిత్య కాలేజీ డైరెక్టర్ ఎస్.పి. గంగిరెడ్డి, ప్రిన్సిపల్స్ సీహెచ్. ఫణి కుమార్, ఎం. చంద్రశేఖర్, కె.వి. శ్రీరామ్, కె. సుధాకర్ పట్నాయక్, ఎఫ్ఎస్ఎస్ సభ్యుడు కె. సుధాకర్ పట్నాయక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు బి. రామకృష్ణ, బి. విమల, ప్రోగ్రామ్ ఆఫీసర్ బి. కిరణ్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు డా. జి.వి.ఎస్. నాగేశ్వరరావు, ఆదిత్య కాలేజీ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నగర ప్రజలు పాల్గొన్నారు.

# వేదమంత్రాలతో పునీతం

**- భక్తులను ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనం**

**అనపర్తి, మేజర్ న్యూస్ :** శ్రీ శారద సంగీత కళా సమితి ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధన ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు శ్రీ ఉమారామలింగేశ్వర వేదశాస్త్ర పరిషత్ 33 వ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ వేద పండితులచే చతుర్వేద పారాయణం వేద గోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాలుగు వేదాల యొక్క విశిష్టతను తెలియజేసి, నాలుగు వేదములకు సంబంధించిన వేద పండితులు వేదపారాయణం చేయడంతో పాటు వేద సభకు విచ్చేసిన అందరికీ వేద ఆశీర్వచనములు అందించారు. ఆర్ష విద్యా తపస్వి బిరుదాంకితులు బ్రహ్మశ్రీ పసర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ వారి ద్వారా ఆది శంకరులు శ్రీ శృంగేరి శారదాపీఠ వైభవం అనే అంశం మీద అద్భుతమైన ఆధ్యాత్మిక ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమం ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ తేతలి సత్యనారాయణ రెడ్డి సౌజన్యంతో నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమములో ముఖ్యఅతిథిగా శ్రీ డాక్టర్ తేతలి వెంకట రామిరెడ్డి, అతిథిగా శ్రీ పడాల మేఘసుందర్ రెడ్డి



పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు తమలంపూడి చినఆదిరెడ్డి ఉపాధ్యక్షులు మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి సభ్యులు తాడి శ్రీనివాస రెడ్డి తమలంపూడి వీర రాఘవరెడ్డి చీకట్ల కృష్ణమూర్తితో పాటు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఓబిసి రిజర్వేషన్ కల్పించకపోతే ఉద్యమించక తప్పదు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** ఉత్తరాంధ్ర జిల్లాలలో జిల్లాలు మినహా మిగిలిన జిల్లాలలో నివసిస్తున్న తూర్పుకాపులకు వెంటనే ఓబీసీ రిజర్వేషన్ కల్పించకపోతే ఉద్యమించక తప్పదని తూర్పు కాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు పీసి. చంద్రమోహన్ అన్నారు. ఆదివారం స్థానిక గోకవరం రోడ్డులో ఉన్న శివ పార్వతి ఫంక్షన్ హాల్ నందు జరిగిన ఎ పి టి కె ఎస్ ఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ మహోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చంద్రమోహన్ మాట్లాడుతూ నిఓ బి సి రిజర్వేషన్ కోల్పోవడం వల్ల తూర్పు కాపు జాతి యువతి యువకులు జాతీయస్థాయిలో విద్యా ఉద్యోగ రంగాలలో తీవ్రంగా నష్టపోతున్నారని బీసీ కులాలలో అత్యధిక జనాభాగా ఉన్నటువంటి తూర్పుకాపులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికై గత 9 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని ఇప్పటికైనా స్పందించి కేంద్ర ప్రభుత్వం తూర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలని లేనిపక్షంలో మా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర సహాయ అధ్యక్షులు బద్దుకొండ వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వెంకటరమణ అధ్యక్షత వహించగా తిప్పనగిరి లక్ష్మణరావు కాకినాడ జిల్లా కమిటీ నాయకులు బదుకొండ శ్రీను కాకినాడ జిల్లా కమిటీ నాయకులు సందక చిన రాంబాబు జగ్గంపేట నియోజకవర్గ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బద్దుకొండ వీర్రాజు జగ్గంపేట మండల కమిటీ సహాయ అధ్యక్షులు సందక పెద్ద రాంబాబు జగ్గంపేట మండల కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ. మక్కువ సత్యనారాయణ జగ్గంపేట టౌన్ కమిటీ ప్రెసిడెంట్. కొండ్రోతు శ్రీనివాస్ జగ్గంపేట టౌన్ కమిటీ ప్రధాన కార్యదర్శి. కునుకు రాంబాబు కనుమ రెడ్డి శ్రీను రౌతు అప్పారావు ఆకుల అప్పారావు కంది తాతాజీ కరుముజ్జి రామకృష్ణ తోరోతు ప్రసాద్ సందక చిన్న శ్రీను సాటిలైట్ సిటీ రాజపూడి ఏలేశ్వరం వెంగయమపురం పెద్దాపురం మల్లిసాల తదితర గ్రామాల తూర్పు కాపు సంఘం పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం మండలం తిమ్మాపురం గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మాజీ ఎమ్మెల్యే వర్మ ఆదివారం అందజేశారు. ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. లబ్ధిదారులు పెద్దింటి శ్రావణి పైడితల్లి రూ.28,460, 2/- మిడతాన సత్యవేణి రూ. 39,378 /- మరి యు యాచలపు అప్పయ్యమ్మ రూ.39,378/- లకు సీఎఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. సుమారుగా లక్ష రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసినట్లు వర్మ తెలిపారు. ప్రతి ఒక్కరికీ వైద్య ఖర్చుల నిమిత్తం గౌరవ ముఖ్యమంత్రి మం జూరు చేశారని, నిరుపేదలు ఆరోగ్యం బాగుండాలని ఉద్దేశ్యంతో, మాట ఇచ్చిన ప్రకారం ఇంటికి పెద్ద కొడుకుగా సాయం చేసినందుకు గాను పి. తిమ్మాపురం గ్రామం తరుపున ధన్యవాదములు తెలియజే స్తుమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సకుమళ్ళ గంగాధర్ రావు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ బర్ల అప్పారావు, యూనిట్ ఇంచార్జీ బర్ల అప్పన, గ్రామ కమిటీ ప్రెసిడెంట్ మరియు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతకు పెద్ద పీట

**- భారీ స్థాయిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా**
**శ్రీ విఘ్నేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘం సమావేశం**
**- పాల్గొన్న అధ్యక్ష, గౌరవ, ఉపాధ్యక్ష, వ్యవస్థాపక, కార్యదర్శి, ఉప కార్యదర్శి, కోశాధికారి, భజన సమాజం సభ్యులు**
**- కళాకారులతో హోరెత్తిన చదలాడ గ్రామం**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, చదలాడ గ్రామంలో శ్రీ వల్లి సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మాజీ ఎంపిటిసి సభ్యులు, శ్రీ కనకదుర్గ బాల భక్త భజన బృందం సభ్యులు కోట శ్రీను ఆధ్వర్యంలో ఆదివారం మధ్యా హ్నం గ్రామంలో ఉన్న పలు భజన సమాజాల పర్యవేక్షణలో, గ్రామ ప్రజలు సహకారంరతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శ్రీ విఘ్నేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘం సమావేశం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా సంఘ అధ్యక్షులు యడవిల్లి సూర్యచక్రం, వ్యవస్థాపకులు ఎలిశెట్టి కామరాజు, కామన స్వా మి, గౌరవాధ్యక్షులు పోతుల వీరన్న చౌదరి, కార్యదర్శి గడపా శివబాబు, ఉప కార్యదర్శి పచ్చిపాల ప్రసాదరావు, ఉపాధ్యక్షులు ఇనుగంటి రామకృష్ణ, ప్రచారకర్త నీలం శ్రీను, కోశాధికారి పంచాది రామకృష్ణ, కమిటి సభ్యులు పాల్గొని మాట్లాడుతూ, ఈ సంఘం ఏర్పడి ఆరు సంవత్సరాలు పూర్తి అవుతందని, అప్పటి నుండి ఇప్పటివరకు నిర్విఘ్నంగా సంఘ కార్యకలాపాలు కొనసాగిస్తూ సంఘాన్ని బలోపేతం చేయడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేస్తూన్నారని అలాగే విస్తృత స్థాయిలో సంఘంలో మహిళా భజన సమాజం సభ్యులు ఎంతో సహకరించి, సంఘ ఔన్న త్యాన్ని ప్రజలలోకి తీసుకువెళుతున్నారని, తెలిపారు. ప్రతీఒ క్కరూ ధర్మ పథంలో నడిచిపుడు భక్తి భావం పెరిగి ఆధ్యాత్మికత వైపు నడక ప్రారంభమ వుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా పలువురు మహిళా భజన సమాజం సభ్యులు, పలువురు ఆధ్మాత్మిక వక్తలు ప్రసంగించారు. అనం తరం శ్రీ హరిదాసును సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా దుశ్శాలువతో సన్మానించారు. దీనికి ముందుగా భజన గురువులు సీనియర్ కళాకారులు కిర్లంపూడి మండలం, చిల్లంగి గ్రామానికి చెందిన కింతాడ సన్యాసిరావు ఇటీవల మృతి చెందడంతో ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు గోపు సూరిబాబు, బండారు మంగబాబు, దువ్వా అచ్చారావు, మావిరెడ్డి నెహ్రూ, డైరెక్టర్లు కరెడ్ల వెంకటరమణ, కొత్త శ్రీను, గుర్రం అప్పన్న దొర, కొడిగుడ్డు పూర్ణదేవి, జువ్వల వీరలక్ష్మీ, వివిధ గ్రామాల నుండి పలు భజన సంఘాలు, కవులు, గాయకులు, హార్మోని కళాకారులు, డోలక్ కళాకారులు, పలు భజన సమాజాల కన్వీనర్లు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విజయవంతంగా తపాలా ఉద్యోగుల సంఘం ద్వైవార్షిక మహాసభ







**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పోస్టల్ శాఖ రాజమండ్రి డివిజన్ ఏఐజిడిఎస్ యూనియన్ డివిజినల్ కాన్ఫరెన్స్ రంపచోడవరం ఆర్కా రిసార్ట్స్‌లో ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమండ్రి డివిజనల్ గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ద్వైవార్షిక మహాసభ జరిగింది. ఈ మహాసభ ముఖ్యఅతిథిలుగా ఆల్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎమ్.శ్రీనివాసరావు, ఏపీ సర్కిల్ ప్రెసిడెంట్ పి.కృష్ణయ్య, ఏపీ సర్కిల్ సెక్రెటరీ వైమర్ రెడ్డి, ఎన్ఎఫ్‌పిఇ రాజమండ్రి డివిజన్ పి3 సెక్రటరీ బి.కొండబాబు పాల్గొన్నారు. డివిజనల్ అధ్యక్షులు బి.వి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మర్రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ఉద్యోగులంతా ఐక్యంగా ఉండాలని, జిడిఎస్ ఉద్యోగులనకు సివిల్ సర్వెంట్స్ హోదాను ఇవ్వాలని, 8 గంటల పని విధానాలను కల్పించాలని, అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం కార్యదర్శి కామ్రేడ్ మహాదేవయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కామ్రేడ్ కృష్ణ యాదవ్ మాట్లాడుతూ తాను స్థానిక పార్లమెంటు సభ్యుల ద్వారా గ్రామీణ తపాల ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లానని అన్నారు. అల్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు తన ప్రసంగంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావించారు. త్వరలో జరగబోయే పోరాటానికి ఉద్యోగులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రామచంద్రపురం బ్రాంచ్‌లో ఒక అధికారి, మెయిల్ ఓవర్సీస్లు ఉద్యోగులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఉదాహరణలతో పెన్షన్ ఉద్యోగ సంఘం నాయకుడు టి.పుల్లేశ్వరరావు వివరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు దుర్గారావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ.సురేంద్రనాథ్, ఏలూరు తాడేపల్లిగూడెం డివిజనల్ కార్యదర్శి ఎస్.కె.బాజీ, ఎస్.రమేష్, కాకినాడ డివిజన్ కార్యదర్శి ఎస్.వెంకట చలం, సామర్లకోట రామచంద్రపురం,తుని బ్రాంచ్ కార్యదర్శులు పి.వీర్రాజు, ఎస్.వి.వి. మునేశ్వరరావు, వినోద్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మాట్లాడారు. అనంతరం జరిగిన ఎన్నికలలో అధ్యక్షునిగా ఆర్.పుష్కరం బిపిఎం రంప కార్యదర్శిగా పి.భూలోకం, బిపిఎం వడిశలేరు కోశాధికారిగా పి.శ్రీనివాస్, ఏబిపియం వీరవరం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజమండ్రి డివిజన్ స్థాయిలో జరిగిన ఈ సదస్సులో డివిజన్ నలుమూలల నుండి 200 మంది ఉద్యోగులు పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారంతా టార్గెట్లపై పోరాటం చేయాలని ముక్తకంఠంతో పిలుపునిచ్చారు.

# యువత జూద క్రీడలకు దూరంగా ఉండాలి



**– పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్**

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** యువత జూద క్రీడలకు దూరంగా ఉండాలని, సాంప్రదాయ ఆటలే మేలని పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ అన్నారు. రానున్న సంక్రాంతి పండుగ నేపథ్యంలో స్థానిక పిఠాపురం ఆర్‌ఆర్ బిహెచ్ ఆర్ కళాశాల మైదానంలో పిఠాపురం యువత ఏర్పాటు చేసుకున్న క్రికెట్ టోర్నమెంటును పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూద క్రీడలు వద్దు సాంప్రదాయ ఆటలు ముద్దు అనే నినాదంతో యువత చైతన్యంతో ముందడుగు వేయడం హర్షణీయమని అభినందించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉండాలని సూచించారు. వారితో క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం పట్టణ అదనపు ఎస్సై లోకేష్ పాల్గొని క్రికెట్ ఆడి యువతను ఉత్సాహపరిచారు. బండి హరీష్ పేరు మీద సంక్రాంతి సంబరాలు క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. టోర్నమెంట్ ఆర్గనైజర్లుగా నాగేంద్ర సూర్య, భాష,చిట్టి,తరుణ్, హనీ వ్యవహరించారు.

# సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు పెడితే కఠిన చర్యలు

**– ఎస్పీ రాహుల్ మీనా**



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాలెం పట్టణంలో ఇటీవల చోటుచేసుకున్న అంశంపై ప్రజలంతా సంయమనం పాటించాలని, సోషల్ మీడియాలో వివాదాస్పద, అభ్యంతరకర పోస్టులు చేస్తే కఠిన చర్యలు తప్పవని రాహుల్ మీనా హెచ్చరించారు. ఆదివారం రావులపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూని ప్రస్తుతం విగ్రహాల వివాదానికి సంబంధించి స్టేటస్ కో కొనసాగుతోందని తెలిపారు. భవిష్యత్‌లో తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ అధికారులు, జిల్లా యంత్రాంగం నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, కొందరు సోషల్ మీడియా వేదికగా అభ్యంతరకర వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి చర్యల వల్ల సామాజిక సామరస్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కొందరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో అనధికారికంగా, దూషణాత్మకంగా వ్యాఖ్యలు చేసే వారిపై కఠిన, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలంతా సంయమనం పాటిస్తూ, శాంతియుతంగా ఉండాలని, సమస్యకు త్వరలోనే అధికారుల సమన్వయంతో పరిష్కారం లభిస్తుందని భరోసా ఇచ్చారు. అదేవిధంగా సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలు కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో అల్లరి మూకలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని బైండోవర్ చేయనున్నట్లు వెల్లడించారు. జూదం, కోడి పందాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను సహించబోమని స్పష్టం చేశారు. గతంలో ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొన్నవారితో పాటు భవిష్యత్‌లో ప్రయత్నించేవారిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతి పండుగను ప్రజలంతా ఆనందంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా జరుపుకోవాలని పోలీసులు కోరుకుంటున్నారని అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ పేర్కొన్నారు. మీడియా సమావేశంలో కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్, సిఐ శేఖర్ బాబు పాల్గొన్నారు.

# ఏలేశ్వరంలో కన్నుల పండుగగా హిందూ సమ్మేళనం



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం రామాలయం వద్ద హిందూ సమ్మేళన కార్యక్రమం ఏలేశ్వరం ఉపమండలాలకు జరిగింది. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులుగా బోనుమంతి శ్రీను, ముఖ్య అతిథిగా శ్రీ యోగి సిద్ధి రామయ్య స్వామిజి, ప్రధాన కర్త గౌరవ మోహన్ కృష్ణ గోదావరి విభాగ్ సహకార్యవాహ విశిష్ట అతిథిగా సమరసత సేవ ఫౌండేషన్ అధినేత చిలుకూరి రామ్ కుమార్ మరియు ఖండ్ కార్యవాహ ఏనుగు సుబ్రహ్మణ్యం, మజ్జి నాగ జగదీష్, రాఘవరావు ప్రధానాచార్య శిష్యుమందిర్ సమక్షంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వహణ ఉపాధ్యక్షులుగా పైలా బోసు, ఉమ్మిడి వెంకట్రావు, కార్యవర్గ సభ్యులుగా గరిక నాగు, పైలా అయ్యప్ప బాధ్యత వహించియున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి హిందూయిజం కాపాడుకోవడానికి ప్రతి హిందువు కూడా తన వంతు సహకారం అందించాలని ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వామిజి పిలుపునివ్వడం జరిగింది. అలాగే మిగిలిన అతిథులు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడి హిందూ ధర్మాన్ని కాపాడుకొని, హిందూయిజం ను చాటిచెప్పలి అని భక్తులకు ప్రసంగించారు. ఈ యొక్క కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సంఘ నాయకులు ముక్కు సుబ్రహ్మణ్యం, యాళ్ళపు సూర్య నారాయణ ప్రముఖులను సన్మానించి హిందూ ధర్మాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి లోవరాజు రెడ్డి వరలక్ష్మి, గొల్లపూడి గణేష్, రామకృష్ణ, పెద్దనాపల్లి మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రీకుటీరంలో పానుగంటి సాహిత్య సమాలోచన



**కాజులూరు, మేజర్ న్యూస్ :** పల్లిపాలెం గ్రామంలో శనివారం ఉదయం ఆంధ్రీకుటీరం, మధుశ్రీ హాల్‌లో పానుగంటి సమాలోచన సభ ఘనంగా జరిగింది. ముఖ్య వక్తలుగా డాక్టర్ పొన్నపల్లి శ్రీరామా రావు నరసాపురం, డాక్టర్ వాడ్రేవు వీర లక్ష్మీ దేవి కాకినాడ వచ్చి విలువైన ప్రసంగాలు చేసారు. ఈ సభకు అధ్యక్షులుగా ఆంధ్రీకుటీరం బాధ్యులు మధునాపంతుల సత్యనారాయణ మూర్తి వ్యవహరించారు. పానుగంటి వారి వర్ధంతిని పురస్కరించుకుని ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ పొన్నపల్లి మాట్లాడుతూ సాక్షి వ్యాసాలు, రచనలను సూక్ష్మంగా స్పృశిస్తూ సాధికారికంగా ప్రసంగించారు. అనంతరం డాక్టర్ వాడ్రేవు వీర లక్ష్మీ దేవి మాట్లాడుతూ పానుగంటి వారి పేరే ఒక బిరుదు. వారికి బిరుదులు వున్నా ఇదొక్కటే చాలు అన్నారు. పానుగంటి కంఠాభరణమును విపులీకరించారు. ఈ సభలో మరో ప్రత్యేకత ఏమిటంటే పానుగంటి వారి వారి మనుమడు పానుగంటి రామచంద్ర రావు, మునిమనుమరాలు మాట్లాడుతూ ఒక వంద సంవత్సరాల భవిష్యత్తును ఆనాడే ఊహించారన్నారు. ఫ్యాషన్‌ల పెరుతో ఆనాటి హెయిర్ స్టైల్ వారి వ్యాసాలలో ఉంది. ఇప్పుడు ఆ పద్ధతి నడుస్తోంది అన్నారు. రామచంద్రపురంకి చెందిన అడ్వకేట్ కాకుళవరపు రామచంద్ర రావు తొలుత స్వాగతం పలికారు. పానుగంటి వారి పదవులు, విద్యార్హతలు వివరించారు. అనంతరం పానుగంటి రామచంద్రరావు దంపతులను, పానుగంటి స్వస్థలం సీతానగరం నుండి వచ్చిన నరేంద్ర అనే యువకుడు పానుగంటి లక్ష్మీ నరసింహారావు సంక్షిప్త జీవిత చరిత్రను ఆవిష్కరించి సభలో పంచారు.

# ఘనంగా ప్రపంచ బ్రెయిలీ డే వేడుకలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** 217వ లూయిస్ బ్రెయిలీ జన్మ దినాన్ని పురస్కరించుకుని విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ బ్రెయిలీ డే వేడుకలు కాకినాడ జేఎన్టీయూ అల్లూమ్ని ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మ, విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడి ఎ.వై.శ్రీనివాసు, వివిధ అంధ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లూయిస్ బ్రెయిలీ చిత్రపటాన్ని పూలమాలతో అలంకరించారు. అనంతరం లూయిస్ బ్రెయిలీ జన్మదినం సందర్భంగా అంధ విభిన్న ప్రతిభావంతులతో కలిసి కేకు కట్ చేశారు. కాకినాడలో విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించు చున్న బ్రెయిలీ ప్రెస్ ద్వారా ముద్రించిన 2026 బ్రెయిలీ లిపి క్యాలెండర్ ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ...కళ్ళు కనిపించని వారికి భవిష్యత్తుపై ఆశ కల్పిస్తూడలూయిస్ బ్రెయిలీ జ్ఞాన జ్యోతిని వెలిగించారన్నారు. కేవలం స్పర్శతోనే అక్షరాలను గుర్తు పట్టి.. అంధులకు ప్రపంచంలో ఏమి జరుగుతుందో తెలుసుకునే విధంగా ఓ భాషను అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత లూయిస్ బ్రెయిలీకి దక్కుతుందని, బ్రెయిలీ లిపి ద్వారా ఎందరో అంధులు చదువుకుంటున్నారని ఆమె తెలిపారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ.. ప్రపంచానికి లూయి బ్రెయిల్ అందించిన సేవలకు గాను ఐక్యరాజ్యసమితి 2018లో లూయి బ్రెయిన్ జన్మదినాన్ని ప్రపంచ బ్రెయిలీ డే నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. బ్రెయిలీ లిపి ద్వారా అంధులు స్వతంత్రంగా చదవడం, రాయడం, నేర్చుకోవడం, పని చేయడం సాధ్యమవుతుందని, ఇది వారి మానవ హక్కుల సాధనకు దోహదపడుతుందని ఆయన తెలిపారు. అనం ఓతరం ప్రపంచ బ్రెయిలీ డే పురస్కరించుకుని అంధ విద్యార్థులకు ఈ నెల 2న నిర్వహించిన వివిధ రకాల పోటీలలో ప్రథమ, ద్వితీయ తృతీయ విజేతలకు సర్టిఫికెట్స్, మెమొంటోస్ ఎమ్మెల్సీల చేతుల మీదుగా ప్రధానంమీదుగా ప్రధానం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన అంధ ఉద్యోగులకు మరియు అంధ సంక్షేమ సంఘాల ప్రతినిధులను దుశ్శాలువ, మెమెంటోలతో సత్కరించారు.

# అభివృద్ధికి ఆయుధం విద్య

**– టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు విజయ నాయక్**




**గోపాలపురం, మేజర్ న్యూస్ :** గోపాలపురం మండలం వాదాలకుంట గ్రామానికి చెందిన పాముల రమణమ్మ తిరుపతయ్య దంపతుల ద్వితీయ కుమార్తె అభినయశ్రీ ఈ ఏడాది జరిగిన నీట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంక్ సాధించి ఎంబిబిఎస్ సీట్ రాజమహేంద్రవరం జిఎస్ఎల్ వైద్య కళాశాలలో పొందింది. అయితే విషయం తెలుసుకున్న రాష్ట్ర క్రీడ సాధికారిత సంస్థ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి, టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు విజయ్ నాయక్ లు ఆదివారం పోలవరం మండలం చేగుండపల్లిలో ఉన్న వారి క్యాంప్ కార్యాలయంలో అభినయశ్రీ ను అభినందించి ఘనంగా సన్మానించారు. అంతేకాకుండా ఆ అమ్మాయి ఎంబీబీఎస్ చదువు నిమిత్తం తక్షణ సహాయంగా పదివేల రూపాయలు అందజేశారు. అలాగే ఎంబిబిఎస్ చదువు పూర్తయ్యే వరకు సంవత్సరానికి రూ.10,000 మించి ఆర్థిక సహాయాన్ని ప్రతి ఏటా అందిస్తామని జగదీశ్వరి నాయక్ దంపతులు హామీ ఇచ్చారు. అభినయశ్రీ పదవ తరగతి, ఇంటర్మీడియట్, నీట్, ఎంసెట్ పరీక్షలలో సాధించిన మార్కులను తెలుసుకుని ముందు ముందు మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆశీర్వదించారు. ఒక పేద దళిత కుటుంబంలో పుట్టి ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయం అన్నారు. అలాగే ఇంటర్మీడియట్లో డేస్కాలర్ గా ఉండి 987/1000 మార్కులు సాధించడం అలాగే ఎంసెట్లో 1750 ర్యాంక్ రావడం సామాన్యమైన విషయం కాదన్నారు. మొదటి ప్రయత్నంలోనే ఎంబిబిఎస్ సీటు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎంబీబీఎస్ కోర్సును దిగ్విజయంగా పూర్తి చేసుకుని మంచి వైద్యురాలిగా స్థిరపడి పేద బడుగు బలహీన వర్గాలవారికి నాణ్యమైన వైద్యాన్ని అందించాలని అభినయశ్రీకు ఈ దంపతులు సూచించారు. ఈ సందర్భంగా అభినయశ్రీ మాట్లాడుతూ చిన్న వయసు కలిగిన తనను సన్మానించి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించిన జగదీశ్వరి విజయ్ నాయక్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మీకోసం PGRS వేదికతో పాటు భూమి సమస్యలకు రెవెన్యూ క్లినిక్

**– జిల్లా కలెక్టర్ (పూర్తి అదనపు బాధ్యతలు) వై.మేఘా స్వరూప్**




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రతి సోమవారం నిర్వహిస్తున్న 'మీకోసం ౖా+=ూ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్) కార్యక్రమంతో పాటు, భూమి సంబంధిత సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు జనవరి 5 (సోమవారం) రోజున రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ (పూర్తి అదనపు బాధ్యతలు) వై. మేఘా స్వరూప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెవెన్యూ క్లినిక్‌ను జనవరి 5 (సోమవారం) ఉదయం 9.30 గంటలకు, రాజమహేంద్రవరం తూర్పు గోదావరి జిల్లా కలెక్టరేట్‌లోని ౖా+=ూ హాల్‌లో, 'మీకోసం' ౖా+=ూ కార్యక్రమంతో పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ సోమవారం ఆయా మండలాల్లో నిర్వహించే 'మీకోసం' ౖా+=ూ కార్యక్రమాలకు తహశీల్దార్లు మరియు రెవెన్యూ డివిజనల్ అధికారులు హాజరుకావాలని సూచించారు. వారి స్థానంలో డిప్యూటీ తహశీల్దార్లు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ క్లినిక్‌కు హాజరయ్యే అధికారులు ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అవసరమైన రెవెన్యూ రికార్డులతో సిద్ధంగా ఉండాలని సూచించారు. భూమి సంబంధిత సమస్యలు, రికార్డుల సవరణ, మ్యూటేషన్, రీ-సర్వే తదితర అంశాలపై వచ్చిన వినతులను అక్కడికక్కడే పరిశీలించి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్షేత్రస్థాయిలో కూడా జనవరి 5 (సోమవారం) రోజున జిల్లా కలెక్టరేట్ నుండి డివిజన్, మండల, మున్సిపల్, గ్రామ, వార్డు సచివాలయాల వరకు 'మీకోసం' ప్రజా సమస్యల పరిష్కార వేదికను యథావిధిగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో సంబంధిత డిప్యూటీ తహశీల్దార్ / రీ-సర్వే డిప్యూటీ తహశీల్దార్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటికి తక్షణ పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలు తమ అర్జీలను వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని, నమోదు చేసిన అర్జీల స్థితిగతులను తెలుసుకునేందుకు 1100 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమాచారం పొందవచ్చని తెలిపారు. వాట్సప్ గవర్నెన్స్ 'మన మిత్రా' యాప్ ద్వారా ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, వేగంగా అందించేందుకు 95523 00009 వాట్సప్ నంబర్ ద్వారా అందుబాటులో ఉన్న 'మన మిత్రా' యాప్ ద్వారా 36 ప్రభుత్వ శాఖలకు చెందిన 700కు పైగా పౌర సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

**– సిఐ టీ.గణేష్**



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ధవళేశ్వరం పోలీస్ స్టేషన్లో ఉన్నటువంటి రౌడీషీటర్లు మరియు పాత నేరస్తులు అందర్నీ స్టేషన్‌కి పిలిపించి ఆదివారం సిఐ టీ.గణేష్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ముఖ్యంగా సంక్రాంతి పండగ నిమిత్తం ఎక్కడైనా పేకాటలు, గుండాటలు, కోడిపందాలు వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా, పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలు పాటించాలని, బైక్‌ల మీద ఓవర్ స్పీడ్‌గా వెళ్ళవద్దని హెచ్చరించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. సెటిల్మెంట్ దందాలు, అనవసర కొట్లాటలకు వెళ్లకుండా పండగ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చెప్పారు.

## ఆర్ఎస్ఎస్ హిందు సమ్మేళన సభ



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ఆర్ ఎస్ ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సామర్లకోట ప్రతిభ విద్య నికేతన్ పాఠశాల ఆవరణలో హిందు సమ్మేళన సభ అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ పీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద సరస్వతీ స్వామి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో కటకం రత్నంకుమారి, ఎస్ వి వి జి ప్రకాష్, పసల పద్మరాఘవ రావు, భయ్యా వాసు, గవరసాని గోపాలకృష్ణ, బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ, పెద్ద ఎత్తున హిందువులు పాల్గొన్నారు.

## ఏపీటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ఏపిటియఫ్ కాకినాడ జిల్లా నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పిఠాపురం సూర్యరాయ విద్యా నంద గ్రంథాలయం నందు ఏపిటియఫ్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. జిల్లా అధ్యక్షులుగా డిఏ రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా ఎం వి వి సురేష్, బి.సురేష్, బి.సత్యప్రసాద్ జనరల్ సెక్రటరీగా కే.ఎస్.సుబ్రహ్మణ్యం, కార్యదర్శులుగా గొర్స దుర్గ ప్రసాద్, ఎం రాగలక్ష్మి, వి.శ్రీరామ మూర్తి, ఎన్. శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాన ఎన్నికల నిర్వాహకులుగా విచ్చేసిన రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ మాట్లాడుతూ తక్షణమే పి.ఆర్. సి. కమీషన్‌ను నియమించాలని, ఐ ఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులపై బోధనేతర పనుల వత్తిడిని నిలిపివేయాలని, తక్షణమే పెండింగ్ డి.ఏ.లు విడుదల చేయాలని, మున్సిపల్, కార్పోరేషన్ ప్రాంతాల్లో నూతన పాఠశాలలు ఏర్పాటు చేయాలని, టెట్ నుండి 2010 పూర్వపు డియస్సి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు.